క్లుప్తంగా

హనుమంతరావు మృతి పార్టీకి తీరని లోటు



మృతదేహంపై జెండా కప్పి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వాజేడు: సీపీఎం సీనియర్ నాయకుడు హనుమంతరావు మృతి పార్టీకి తీరని లోటని పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి రావు అన్నారు. ద్విచక్రవాహనం ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యం పొందుతూ మంగళవారం వాజేడులో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీం కార్యకర్తలు నాయకులు తరలివచ్చి ఆయన మృత దేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రఘుపతి రావు మాట్లాడుతూ ఆయన పార్టీకి దూరం కావడం బాధాకరమన్నారు. పరామర్శించిన వారిలో ముత్తయ్య, రమాదేవి, ఉదయ, రవీందర్, నారాయణమూర్తి ఉన్నారు.

ట్రాన్స్‌కో అధికారుల నూతన ఫోన్‌నంబర్లు

మంగపేట: మండలంలోని విద్యుత్ సరఫరా (ట్రాన్స్‌కో) అధికారులు, సబ్‌స్టేషన్లకు ప్రభుత్వం నూతన సెల్‌ఫోన్ నంబర్లను కేటాయించినట్లు మండల ఇన్‌చార్జ్ ఏఈ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా అంతరాయం కలిగినా, ప్రమాదం చోటు చేసుకున్నా వెంటనే ఆయా నంబర్లకు సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు. కమలాపురం ఇన్‌చార్జ్ ఏఈ క్రిష్టారావు సెల్‌ఫోన్ నంబర్ 8712486784, సబ్ ఇంజనీర్ వెంకటేశ్ 8712486780, లైన్‌ఇన్‌స్పెక్టర్ మధనాచారి, మంగపేట లైన్‌ఇన్‌స్పెక్టర్ దురిశెట్టి మధు, లైన్‌ఇన్‌స్పెక్టర్ 8712486776, మల్లూరు లైన్‌ఇన్‌స్పెక్టర్ మేడిశెట్టి రమణయ్య 8712486775 కమలాపురం 35/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సెల్ నంబర్ 8712486773, మంగపేట 8712486778, మల్లూరు 8712486775, రాజుపేట 8712486779, అకినేపల్లి మల్లారం 8712486793 నంబర్లను కేటాయించినట్లు ఆయన తెలిపారు.

ఐటీఐలో చేరండంటూ ఫ్లెక్సీల ఏర్పాటు



వాజేడు : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో విద్యార్థులు చేరాలని కోరుతూ వాజేడు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ పలు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఏఏ కోర్సుల్లో ఎన్ని సీట్లు ఖాళీ ఉన్నది అందులో పొందుపర్చారు. పలు కూడళ్లలో స్వయంగా ఆయన వాటిని సిబ్బందితో కలిసి కట్టారు. ఐటీఐలో చేరేలా చూడాలని కోరుతూ అధికారులను కోరడంతో పాటు కర పత్రాలను పంపిణీ చేశారు.

వర్షాకాలంలో ఆరోగ్య సూత్రాలు పాటించాలి



వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ రాహిల్

వాజేడు : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని వాజేడు, పేరూరు వైద్యులు కొమరం మహేందర్, రాహిల్ అన్నారు. మండలంలోని మొరుమూరులో జ్వరాలపై ఇంటింటి సర్వేలు నిర్వహించి అనారోగ్యంతో ఉన్న వారికి మందులను ఇచ్చారు. గర్భిణులను, బాలింతలను పరీక్షించారు. అదే విధంగా పేరూరు వైద్యశాల పరిధిలోని అయ్యవారిపేట, కడేకల్ గ్రామాల్లో డాక్టర్ రాహిల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించి రోగులను పరీక్షించారు. అవసరం ఉన్న వారికి మందులను ఇవ్వడంతో పాటు పలు సూచనలను చేశారు. కార్య క్రమాల్లో హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, కోటిరెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

టీబీ రోగులకు వైద్య పరీక్షలు

ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూర్ పీహెచ్‌సీ పరిధిలోని రొయ్యూర్ గ్రామంలోని టీబీ, హెచ్ఐవీ, డయాలసిస్, షుగర్, బీపీ, థైరాయిడ్, కాలేయం వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసినట్లు మొదటి ఏఎన్ఎం ఝాన్సీలక్ష్మి తెలిపారు. మంగళవారం రొయ్యూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో 30 మందికి తెమడ, రక్తన మూనాలను సేకరించి పరీక్షలు చేశామని తెలిపారు. పాత వ్యాధిగ్రస్తులను వాహనం ద్వారా ఏటూరునాగారంలోని సామాజిక ఆస్పత్రికి తరలించామని చెప్పారు. పాజిటివ్ వచ్చిన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. అంతేకాకుండా ఈ పరీక్షలు ప్రతి సబ్ సెంటర్‌కు 100 రోజులకోసారి చేయడం జరుగుతుందని తెలిపారు. ఏఎన్ఎం పావని, హెల్త్ అసిస్టెంట్ నగేష్, రవి పాల్గొన్నారు.

రహదారిపై ప్రమాదకరంగా గుంత

- నిత్యం వందల కొద్ది వాహనాల రాకపోకలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కంతనపల్లి చెరువు వద్ద ప్రధాన రహదారిపై ప్రమాద కరంగా మారిన గుంత

కన్నాయిగూడెం : మండలంలోని కంతనపల్లి చెరువు సమీపంలో ప్రధాన రహదారిపై మట్టి కుంగి ఏర్పడ్డ గుంత ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం తుపాకులగూడెం, ఏటూరునాగారం పలిమెల ఇతర ప్రాంతాల నుంచి వందలకొద్ది వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా అంటూ పలువురు మండల ప్రజలు అధికారులను సూటిగా ప్రశ్నిస్తున్నారు. మండలంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు కూడా ప్రతీ రోజు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు ఆరు నెలల ముందు నుంచి ఈ గుంత ఇలానే ఉంటుంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో పాటు మరమ్మతులు కూడా చేయడంలేదు. రాత్రి వేళలో ప్రయాణం సాగిస్తున్న వాహనదారులకు దగ్గరికి పోయేంత వరకు కూడా గుంత ఏర్పడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్లు పత్రికాముఖంగా అధికారులకు గుర్తు చేసినా స్పందించక పోవడంపై ఆంతర్యం ఏమిటని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు గానీ మండలంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులు గానీ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గుంతకు మరమ్మతు చేపట్టాలి



గుంతతో ద్విచక్రవాహనాలపై వెళ్తుంటే ఎదురుగా వస్తున్న వాహనం తప్పించాలంటే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. రాత్రి సమయంలో ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకునే అవకాశం ఉంది. గుంతకు మరమ్మతులు చేపట్టాలి.

– దుర్గం రాజుకుమార్, స్థానికుడు

పేదవాడి కల సాకారం చేస్తున్న ప్రభుత్వం

- భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు
- నాలుగేళ్లలో అర్హులందరికీ ఇళ్లు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



వెంకటాపురం (కె) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

వాజేడు : పేదవాడి కలను సాకారం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పారదర్శకంగా పార్టీలకతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంజూరు ఉత్తర్వు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలక ప్రభుత్వం పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలను ఇప్పటికే కొనసాగుతున్నట్లు చెప్పారు. మొదటి దఫాలో మంజూరైన ఇంటి పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో కొంత మంది ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. మంత్రి దనసరి సీతక్క, ఎమ్మెల్యే వెంకట్రావుల చొరవతో ఈ నియోజకవర్గంలోని ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని అన్నారు. జిల్లాలో ఇప్పటికే బేస్‌మెంట్ లెవెల్ చేరిన ఇళ్లకు సంబంధించిన సొమ్ము వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే ముందు పంచాయతీ సెక్రటరీ దృష్టిలో ఉంచాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎమ్మెల్యే వెంకట్రావు, కలెక్టర్ నేరుగా వెళ్లి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ముందు నిర్మిస్తున్న కాంప్లెక్స్ విషయంపై కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం నిర్మిస్తున్న పనులను కొనసాగించాలని ఆదేశించారు. కార్య క్రమంలో హౌసింగ్ పీడీ సూర్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, సొసైటీ అధ్యక్షుడు యగ్గడి అంజయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వెంకటాపురం(కె): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను మంగళవారం అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ దివాకరతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు నాణ్యతతో కూడిన ఇల్లు నిర్మించి అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

- సీడీపీఓ ప్రేమలత



మాట్లాడుతున్న సీడీపీఓ ప్రేమలత

కన్నాయిగూడెం : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందించాలని సీడీపీఓ ప్రేమలత అన్నారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండలంలోని లక్ష్మీపురం, దేవాదుల, రాజన్నపేట, వెంకటరావుపేట తదితర గ్రామాల్లో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి అంగన్‌వాడీ టీచర్లు రెండేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించుకున్నారు. అనంతరం సెంటర్లలో నిర్వహిస్తున్న కార్యక్రమాల ప్రాముఖ్యతను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఆటాపాటలతో పిల్లలకు చదువు నేర్పించనున్నట్లు సీడీపీఓ తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీపురం ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు సమ్మక్క, ఉపాధ్యాయుడు సుందర్, అంగన్‌వాడీ టీచర్లు రజిత, కుముర్‌నిషా, అనిత, రజిత, లక్ష్మీకాంత, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏటూరునాగారం : స్థానిక ఎస్సైగా రాజ్‌కుమార్ విధుల్లో ఇటీవల చేరగా మంగళవారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఎస్సైని కలిసి సన్మానించారు. గ్రామంలోని స్థితిగతులు ఆయనకు వివరించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు, రవి, అక్షిత్, లక్కి, గౌస్, రమేష్ పాల్గొన్నారు.

గుడిసెవాసులకు మంత్రి సీతక్క భరోసా



గుడిసెవాసులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ అటవీ ప్రాంతంలో సోమవారం జరిగిన సంఘటనపై మంత్రి సీతక్క ఆరా తీస్తూ గుడిసెవాసులైన గిరిజనులకు అండగా ఉంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం రొయ్యూర్‌లోని గుడిసెవాసులను కాంగ్రెస్ నాయకులు పరామర్శించి వారి వివరాలను, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కేకే గూడెం వాసులకు ఇంటి స్థలాలు వచ్చేలాగా తప్పకుండా న్యాయం చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చిందని వారికి న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా, మండల, గ్రామ నాయకులు, మహిళలు, యువజన నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం అందిస్తే మరమ్మతులు చేపడుతాం

ములుగు రూరల్ : ప్రమాదకరంగా ఉన్న లైన్‌ల సమాచారం గ్రామ, మండల స్థాయి విద్యుత్ అధి కారులకు సమాచారం అందించినట్లయితే వెంటనే మరమ్మతులు చేపడుతామని విద్యుత్ శాఖ డీ ఈ నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, లూజ్‌గా ఉన్న లైన్‌లు, వంగిపోయిన స్తంభాలు ఉన్నట్లయితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు సహకరించిన వారు అవుతారని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన వరుణ్

ఏటూరునాగారం : స్థానిక సామాజిక ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సోయం వరుణ్ సోమవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని బూటారం గ్రామానికి చెందిన వరుణ్ సామాజిక ఆస్పత్రిలో విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా 163 జాతీయ రహదారి ఎక్కెల క్రాస్‌వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం అతడిని వరంగల్‌కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని తోటి ఉద్యోగులు తెలిపారు.

రాహుల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సూర్య

ములుగు రూరల్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా ములుగు గట్టమ్మ ఆలయం వద్ద నుంచి ఇంచర్ల ఎంఆర్ గార్డెన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించాలని అన్నారు. ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించే రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలకు పార్టీ యూత్ నాయకులు, నాయకులు, హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, ఎండీ.ఇస్సార్‌ఖాన్, అశ్విన్ రాథోడ్, జయపాల్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, శ్రీనివాస్, వంగ రవియాదవ్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

కబ్జాకు గురైన శిఖం భూముల సర్వే



కబ్జాకు గురైన శిఖం భూములను సర్వే చేస్తున్న అధికారులు

మంగపేట : మండలంలోని చెరుపల్లి, బోరునర్సాపురం రెవెన్యూ పరిధిలోని ఉప్పలనర్సయ్య చెరువులో కబ్జాకు గురైన శిఖం భూములను గుర్తించేందుకు తహసీల్దార్ తోట రవీందర్ ఆధ్వర్యంలో ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ ఎస్కే సఫియా ఆయకట్టు రైతులతో కలిసి మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చెరువులోని 56 ఖాస్రాలోని శిఖంలో సుమారు 20 ఎకరాల వరకు భూమి ఖబ్జాకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. త్వరలోనే చెరువుకు సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలించి చెరువులోని శిఖం భూమిని అందులో ఆక్రమణకు పాల్పడిన రైతులకు నోటీసులు జారీ చేసి భూముల చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. అధికారుల వెంట చెరువు ఆయకట్టు రైతులు ఉన్నారు.

పాఠశాలకు బీరువా, టేబుల్ బహూకరణ



పాఠశాలకు బీరువా, టేబుల్‌ను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

మంగపేట : మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు బీరువా, టేబుల్‌ను బహూకరిస్తు హెచ్‌ఎం బానోతు బాలాజీకి మంగళవారం అప్పగించారు. పాఠశాలలో 2009–10 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమవంతు సాయంగా రూ.26 వేలు విలువ చేసే బీరువా, టేబుల్‌ను అందజేస్తున్నామని, అదే విధంగా 2025–26 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తూ వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రూ 4,000, ద్వితీయ స్థానం వారికి రూ 2,000 నగదు బహుమతిని ప్రోత్సాహకంగా అందచేయనున్నట్లు పూర్వ విద్యార్థులు అశోక్‌కుమార్, స్నేహకుమార్ తెలిపారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం పలువురు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, పూర్వపు విద్యార్థులు అనేక విధాలుగా దాతృత్వ గుణంతో సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పాఠశాలలోని ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు, పూర్వపు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఆయా గ్రామాల్లోని విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, పాల్గొన్నారు.

వంట సామగ్రి పంపిణీ



మధ్యాహ్న భోజన నిర్వాహకులు, హెచ్‌ఎంలకు వంట సామగ్రిని అందజేస్తున్న ఎంఈఓ మేనక

మంగపేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన నిర్వహణ వంట సామగ్రిని ఆయా పాఠశాలల హెచ్‌ఎం భోజన నిర్వాహకులకు ఎంఈఓ పొదెం మేనక మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని 58 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 6 ఉన్నత పాఠశాలలతో పాటు, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నటు వంటి 20 ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహణకు వినియోగించే వంట సామగ్రిని ప్రభుత్వం పంపించిందన్నారు. ఒక్కో పాఠశాలకు రెండు బియ్యం డ్రమ్ములు, వాటర్ క్యాన్లు, రెండు వంటగిన్నెలు, రెండు బేసిన్లు, బకెట్లు, వాటర్ జగ్గులు, వంట గరిటెలు తదితర సామగ్రిని ఆయా పాఠశాలకు అందజేసినట్లు ఎంఈఓ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

- కన్నాయిగూడెం తహసీల్దార్ సర్వర్



ఏటూరునాగారం : రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డీటీ రాహుల్‌చంద్రవర్మ



కన్నాయిగూడెం: వినతులు తీసుకొని సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ సర్వర్

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: భూ భారతి ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపుతామని, కన్నాయిగూడెం తహసీల్దార్ సర్వర్, ఏటూరునాగారం డిప్యూటీ తహసీల్దార్ రాహుల్‌చంద్ర వర్మ అన్నారు. మంగళవారం ఏటూరునాగారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రెండో రోజు భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 1,261 దరఖాస్తులు, కార్యాలయానికి మరో 400 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి సమస్యలు లే కుండా పరిష్కారం చూపుతామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఈ రైతుల వద్దకు చేరుకొని వారి నుంచి వివరాలను సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చిక్కుల కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నాయిగూడెం మండలంలో భూ భారతి పై రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. మంగళవారం బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీలో తహసీల్దార్ సర్వర్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సభకు రైతులు భారీ సంఖ్యలో వినతులు సమర్పించారు. గత కొన్నేళ్ల నుంచి పరిష్కారం కాకుండా ఉన్న పట్టాభూములకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడైనా పరిష్కారం దొరుకుందా అని ఆశాజనకంతో ఉన్నారు. కార్యక్రమంలో ఐఆర్ గణేష్ పాల్గొని వినతులు తీసుకొని అర్జీదారులు రశీదులు అందించారు

గిరిజనులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- బీజేపీ రాష్ట్ర గిరిజన అధికార ప్రతినిధి గుగులోతు స్వరూప



గిరిజనులతో మాట్లాడుతున్న స్వరూప

ఏటూరునాగారం : గిరిజనులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర గిరిజన అధికార ప్రతినిధి గుగులోతు స్వరూప అన్నారు. మంగళవారం మండలంలోని రొయ్యూర్ సమీపంలో గుడిసెవాసుల్లోని గిరిజనులను కలుసుకొని జరిగిన సంఘటనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన మహిళా మంత్రి అయి కూడా గిరిజనులను పట్టించుకోకుండా ఇంతవరకు ఆ సంఘటన స్థలాన్ని పర్యటించకపోవడం శోచనీయమన్నారు. వారిపై అక్రమ కేసులు పెడితే బీజేపీ నుంచి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై జాతీయ ఎస్టీ కమిషన్‌ను కలిసి విషయం తెలియజేస్తానని తెలిపారు. ఆమె వెంట జి. హరిబాబు, చక్రవర్తి, జి.రాజశేఖర్, కె.సంపత్, పి.సమ్మయ్య, శ్రీను, రాకేష్, మహాలక్ష్మీ, గంగా, సురేందర్, సత్యం, రాజు, శ్రీను, ఆంజనేయులు,తదితరులు సుగుణ పాల్గొన్నారు.

అధికలోడుతో వెళ్తున్న ఇసుక లారీ సీజ్

ఏటూరునాగారం : భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఏటూరునాగారం మీదుగా అధికలోడుతో వస్తున్న ఇసుక లారీని సీజ్ చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఇసుక లారీలో కెపాసిటీకి మించి ఎక్కువగా ఉందని చిన్నబోయినపల్లి వే బ్రిడ్జి వద్ద తూకం వేయడంతో తెలిసిందన్నారు. దీంతో నిబంధనల ప్రకారం లేనందున కేసు నమోదు చేసి లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు పావని

ములుగు రూరల్ : మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు గుంటోజు పావని అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ వ్యాపార రంగాల్లో ముందుకు తీసుకెళ్తుందని అన్నారు. మహిళలు మంత్రి సీతక్కను ఆదర్శంగా తీసుకొని రాజకీయాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు పిట్టల రాధిక, ఆసియా, జక్కుల స్వర్ణ, సంధ్య, కొయ్యడ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.